విస్తారా విమానంలో సాంకేతికలోపం

- 20 నిమిషాలు గాల్లోనే చక్కర్లు కొట్టిన పైలట్
- మరో విమానంలో ప్రయాణికుల తరలింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ) : శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గురువారం సాయంత్రం టేకాఫ్ అయిన UK-880 విస్తారా విమానంలో టెక్నికల్ సమస్య తలెత్తింది. దీంతో పైలట్ 20 నిమిషాలపాటు గాల్లోనే చక్కర్లు కొట్టాడు. సాంకేతికలోపంతో అప్రమత్తమైన పైలట్ తిరిగి శంషాబాద్‌లోనే విమానాన్ని ల్యాండ్ చేశాడు. ఫ్లైట్‌లో 180 మంది ప్రయాణికులు ఉన్నారని, మెయింటనెన్స్ కారణంగానే అత్యవసర ల్యాండ్ అయినట్టు విస్తారా యాజమాన్యం ప్రకటించింది. ప్రయాణికులను వేరే ఫ్లైట్‌లో ఢిల్లీకి తరలించారు.

ఉత్కంఠ రేకెత్తించిన ఎయిర్ ఇండియా

తిరుచ్చిలో సురక్షిత ల్యాండింగ్

చెన్నై, అక్టోబర్ 11: తమిళనాడులోని తిరుచ్చిలో ఓ ఎయిర్ ఇండియా విమానం ఉత్కంఠకు గురి చేసింది. తిరుచ్చి నుంచి షార్జాకు వెళ్లేందుకు 141 మంది ప్రయాణికులతో శుక్రవారం సాయంత్రం 5.45కు బయలుదేరిన బోయింగ్ 737 విమానంలో కొద్దిసేపటికే హైడ్రాలిక్ వ్యవస్థలో సాంకేతిక లోపం ఏర్పడింది. దీంతో విమానాన్ని తిరిగి తిరుచ్చి ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్ చేయాలని నిర్ణయించారు. అయితే ల్యాండింగ్ గేర్ పనిచేయకపోవచ్చునని భావించి ఇంధనం ఖాళీ కోసం విమానాన్ని రెండు గంటలపాటు గాలిలో చక్కర్లు కొట్టించారు. తర్వాత బెల్లీ ల్యాండింగ్ చేయించాలని నిర్ణయించగా ల్యాండింగ్ గేర్ పనిచేయడంతో రాత్రి 8.15 గంటలకు విమానం సురక్షితంగా తిరుచ్చి ఎయిర్‌పోర్ట్‌లోనే ల్యాండ్ అయ్యింది.

సోయా రైతుకు సర్కారు టోపీ!

- కేంద్రం కోటాలో కొనుగోలుకు మార్క్‌ఫెడ్ నిర్ణయం
- ఉత్పత్తి అంచనా 2.60 లక్షల టన్నులు..
- కొనుగోలుకు 56వేల టన్నులే అనుమతి
- మిగిలిన పంటపై చేతులెత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం
- మ్యానిఫెస్టోలో ప్రకటించిన బోనస్ కూడా బోగస్సే
- పైగా పంట కొనుగోలుకు క్యాప్ నిబంధనలు
- ప్రభుత్వ నిర్ణయంపై సోయారైతుల ఆగ్రహం

ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు వచ్చిన సోయాబీన్

హైదరాబాద్/ఆదిలాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): మార్కెట్లో సోయాబీన్ ధర భారీగా పడిపోయింది. మద్దతు ధర క్వింటాలుకు రూ. 4892 ఉండగా మార్కెట్లో కేవలం రూ. 3500 నుంచి రూ. 4వేల లోపే ధర పలుకుతున్నది. ఎన్నికల సమయంలో పంట మద్దతు ధరకు అదనంగా రూ.450 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు బోనస్ సంగతి దేవుడెరుగు కనీసం మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కూడా వెనకంజ వేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కేంద్రం కోటాలోనే కొనుగోళ్లు...

సోయాబీన్ ధరలు పడిపోవడంతో పంట కొనుగోలుకు కేంద్రం అంగీకరించింది. కేంద్ర నిబంధనల ప్రకారం మొత్తం ఉత్పత్తిలో 25శాతం అనగా 56,550 టన్నుల సోయాబీన్ కొనుగోలుకు ఆదేశించింది. పంట కొనుగోలుకు మార్క్‌ఫెడ్ మొత్తం 37 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం అధికారులు 13 కేంద్రాలు ప్రారంభించి 50 టన్నుల సోయాబీన్ కొనుగోలు చేశారు. ఈ సీజన్‌లో సుమారు 4 లక్షల ఎకరాల్లో సోయాబీన్ పంట సాగు కాగా 2.60 లక్షల టన్నుల ఉత్పత్తి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. కేంద్ర ప్రభుత్వం 56వేల టన్నులు మాత్రమే కొనుగోలుకు ఆదేశించింది. అంటే మిగిలిన 2.04 లక్షల టన్నుల పంటను ఎవరు కొనుగోలు చేయాలనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. వాస్తవానికి మిగిలిన పంటను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలి. కానీ ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు.

బోనస్ హామీ... బోగసేనా ?

ఎన్నికలకు ముందు సోయాబీన్ పంటలకు బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపరిచింది. నిరుడు మద్దతు ధర రూ. 3950 ఉండగా కాంగ్రెస్ పార్టీ రూ. 4400(రూ. 450 లేదా 11 శాతం బోనస్) లకు కొనుగోలు చేస్తామని ప్రకటించింది. ఈ లెక్కన ప్రస్తుతం సోయాబీన్ మద్దతు ధర రూ. 4892గా ఉండగా అదనంగా రూ. 450 బోనస్ కలిపి రూ. 5342కు కొనుగోలు చేయాలి. ఒకవేళ శాతం ప్రకారం లెక్కిస్తే రూ. 5430 ధరకు కొనుగోలు చేయాలి. కానీ ప్రభుత్వం ఏ ధరకూ కొనుగోలు చేయడం లేదు. అంతేగాక అసలే ధర లేక ఇబ్బంది పడుతున్న రైతులపై ప్రభుత్వం పిడుగు వేసింది. ఎకరాకు 6.52 క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ క్యాప్ నిబంధనపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి కోతలు, క్యాప్ పెట్టకుండా మొత్తం పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రూ.22 వేలు నష్టం..

నేను ఆరెకరాల్లో సోయా సాగు చేశా. ఎకరాకు 10 క్వింటాళ్లకు పైగా వచ్చింది. ఆరెకరాల్లో 65 క్వింటాళ్ల పంట తీశా. ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు సోయాను అమ్మకానికి తీసుకొచ్చా. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎకరాకు ఆరున్నర క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటామని కొనుగోలు కేంద్రం సిబ్బంది అంటున్నారు. ఈ లెక్కన నేను 40 క్వింటాళ్ల పంటను మాత్రమే విక్రయించే అవకాశం ఉంది. మిగిలిన ఉత్పత్తులను ప్రైవేటు వ్యాపారులకు అమ్మాలి. సర్కారు నిర్ణయంతో రూ.22 వేలు నష్టపోవాల్సి వస్తున్నది.

- రాము, ఖోడద్, తలమడుగు

15 క్వింటాళ్లు మిగులుతుంది

నాలుగెకరాల్లో సోయా వేశా. 40 క్వింటాళ్ల పంటను ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చా. ఇక్కడ ఎకరానికి ఆరున్నర క్వింటాళ్లు మాత్ర మే కొంటామని అంటున్నారు. ఈ లెక్కన ఇంకా 15 క్వింటాళ్లు మిగులుతుంది. ప్రైవేటు వ్యాపారులకు అమ్మితే రూ.14 వేల నష్టం వస్తుంది. మార్కెటింగ్ సిబ్బంది 13 శాతం తేమ ఉన్నా పంటను తీసుకోవడం లేదు.

- తిరుమలేశ్, తంతోలి, ఆదిలాబాద్ రూరల్ మండలం

చిట్యాల వద్ద మంటల్లో దగ్ధమవుతున్న లారీ

బ్రిడ్జిని ఢీకొట్టిన లారీ.. పేలిన డీజిల్ ట్యాంకు

- మంటలు చెలరేగి దగ్ధం
- జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం

చిట్యాల, అక్టోబర్ 11 : సిమెంటు లారీ బ్రిడ్జిని ఢీకొట్టడంతో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన శుక్రవారం ఉదయం నల్లగొండ జిల్లా చిట్యాలలో 65వ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ వైపు నుంచి సిమెంటు లోడ్ లారీ హైదరాబాద్ వైపు వెళ్తున్నది. ఆ లారీ చిట్యాలలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిని దాటిన తర్వాత ఉన్న బ్రిడ్జిని ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ డీజిల్ ట్యాంకు బ్రిడ్జికి తగిలి పేలిపోవటంతో మంటలు చెలరేగి లారీ దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రోడ్డుపై లారీ దగ్ధం కావడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దాంతో పోలీసులు ట్రాఫిక్‌ను ఒకే వైపు మళ్లించి, దగ్ధమైన లారీని అడ్డు తొలగించారు. ఈ ఘటనపై ఫిర్యాదు రానందున కేసు నమోదు చేయలేదని ఎస్సై తెలిపారు.

వీఎన్ఈఎస్ లైసెన్స్ రద్దు

యాజమాన్యం సందేశాలకు స్పందించొద్దు : మహబూబ్ కాలేజ్

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): వెంకట్ నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ (వీఎన్ఈఎస్) లైసెన్సును రద్దు చేసినట్టు మహబూబ్ కాలేజ్(మల్టీ పర్పస్ హైయర్ సెకండరీ స్కూల్ సొసైటీ) శుక్రవారం ప్రకటనలో వెల్లడించింది. స్వామి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎస్‌వీఐటీ), స్వామి వివేకానంద పీజీ కాలేజ్(ఎస్‌వీపీజీ), బాల్టన్ స్కూల్ వంటి విద్యాసంస్థలు ఇప్పటివరకు వీఎన్ఈఎస్ ఆధ్వర్యంలో నడిచాయని, ప్రస్తుతం తమ నియంత్రణలోకి తీసుకున్నట్టు మహబూబ్ కాలేజ్ తెలిపింది. ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయించగా అనుకూలంగా తీర్పు వచ్చినట్టు పేర్కొన్నది. వీఎన్ఈఎస్ అధ్యక్షుడు డాక్టర్ కేవీకే రావు, ఆయన కుమారుడుకే శ్రీహర్ష శశాంక్, సభ్యుల జోక్యం, బెదిరింపుల కారణంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి వచ్చినట్టు మహబూబ్ కాలేజ్ తెలిపింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధన, బోధనేతర సిబ్బంది వీఎన్ఈఎస్ సభ్యుల నుంచి వచ్చే సందేశాలకు స్పందించొద్దని సూచించింది.

స్వీయ రక్షణతోనే ప్రమాదాల నివారణ

ఉద్యోగులకు వ్యక్తిగత లేఖల ద్వారా సీఎండీ దసరా శుభాకాంక్షలు

శ్రీరాంపూర్, అక్టోబర్ 11 : ఉద్యోగులు స్వీయ రక్షణతోనే ప్రమాదాలను నివారించడం సాధ్యమవుతుందని సింగరేణి సీఎండీ బలరామ్ పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులకు శుక్రవారం వ్యక్తిగత లేఖల ద్వారా దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. స్వీయ రక్షణ చర్యలు పాటిస్తూ ఈ ఏడాది నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల సాధనకు కృషిచేయాలని సూచించారు. పోటీ ప్రపంచంలో సంస్థ సవాళ్లు ఎదుర్కోవాలంటే సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని ఉత్పత్తి, ఉత్పాదకతకు కృషిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వినియోగదారులను నిలుపుకోవాలంటే నాణ్యతతో కూడిన బొగ్గు సరఫరా చేయాలని, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకునేందుకు సంస్థలోని భారీ యంత్రాలు, భూగర్భ గనుల్లో ఎస్‌డీఎల యంత్రాల పూర్తి పనిగంటల సమయాన్ని వినియోగించాల్సి ఉంటుందని తెలిపారు. జైపూర్ ఎస్‌టీపీపీలో మరో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోనున్నామని చెప్పారు. పర్యావరణ హితంగా వ్యాపార ధృక్పథంతో సింగరేణి వ్యాప్తంగా 540 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటుకు నిర్ణయించినట్లు, ఇప్పటికే 245 మెగావాట్ల ప్లాంట్లను నిర్మించినట్లు తెలిపారు. ఆస్పత్రులను పూర్తిస్థాయిలో ఆధునీకరిస్తామని పేర్కొన్నారు. నూతన క్వార్టర్లు నిర్మిచనున్నట్లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా సీబీఎస్ సిలబస్ వచ్చే విద్యా సంవత్సరం నుంచి మొదలు పెడుతామని వివరించారు. ఉత్పత్తి, థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ దేశంలోని ప్రభుత్వ రంగ పరిశ్రమలకు ఆదర్శంగా నిలుస్తున్నట్లు వెల్లడించారు.

సింగరేణి సీఎండీ బలరామ్

వార్డు స్థాయిల్లో ఇందిరమ్మ కమిటీలు

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 11 : నిరుపేదలకు ఇండ్లను సమకూర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం అర్హులను ఎంపిక చేసేందుకు మండలాలు, పట్టణాల్లో వార్డు స్థాయిల్లో కమిటీలను నియమించాలని నిర్ణయించింది. 12వ తేదీలోగా ఈ కమిటీల నియామక ప్రక్రియను పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్ జీవో విడుదల చేశారు. గ్రామపంచాయతీల్లో సర్పంచ్ గానీ, ప్రత్యేకాధికారి గానీ.. మున్సిపాలిటీల్లో వార్డు కౌన్సిలర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. సభ్యులుగా ఇద్దరు స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు, అభివృద్ధిపై ఆసక్తి కలిగిన ముగ్గురు స్థానికులు ఉంటారు. కన్వీనర్‌గా జీపీ కార్యదర్శి, వార్డు ఆఫీసర్ ఉంటారు.

సింగరేణి ప్రగతికి కృషి చేయాలి

రెబ్బెన, అక్టోబర్ 11 : సింగరేణి సంస్థను అభివృద్ధి బాటలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, సీఎండీ బలరాం ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా చేపట్టిన ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర కార్యక్రమం శుక్రవారం బెల్లంపల్లి ఏరియా గోలేటి సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించారు. సింగరేణి ఉద్యోగులకు సంబంధించిన పెర్క్ అలవెన్స్‌పై ఉద్యోగులకు ఆదాయ పన్ను లేకుండా కేంద్రంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం శ్రీనివాస్, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఏరియా ఎస్‌వోటూజీఎం రాజమల్లు, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహరా, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు. కాగా, ఐఎన్టీయూసీ నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కేంద్ర కమిటీ సభ్యులు సంగెం ప్రకాశ్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

గోలేటి సీఈఆర్ క్లబ్‌లో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్

బెల్లంపల్లి, అక్టోబర్ 11 : మండలంలోని చర్లపల్లిలో ప్రభుత్వ పాఠశాల భవనానికి ఎమ్మెల్యే వినోద్ శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, కార్మికులు

ఎస్టీపీపీలో మాట్లాడుతున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

నూతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

జైపూర్, అక్టోబర్ 10 : సింగరేణి అధికారులు, కార్మికులు నూతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని కంపెనీని లాభాల బాటలోకి తీసుకురావాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఎస్టీపీపీ, ఇందారం ఓపెన్‌కాస్టు, ఇందారం భూగర్భ గనులను శుక్రవారం అధికారులతో కలిసి సందర్శించారు. సింగరేణి వ్యాప్తంగా నిర్వహించిన 'ఉజ్వల సింగరేణి ఉద్యోగుల పాత్ర' కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఎస్టీపీపీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అంతకుముందు అధికారులు నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో సింగరేణి ఇప్పటి వరకు సాధించిన ఉత్పత్తి, విద్యుత్‌కేంద్రంకు సంబంధించిన ఉత్పత్తి వివరాలను వివరించారు. దీంతో పాటుగా సీఎం, డిప్యూటీ సీఎం, సింగరేణి సీఎండీ ప్రసంగాలను కార్మికులకు పవర్‌పయింట్ ప్రజంటేషన్‌లో వివరించారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్ మాట్లాడుతూ.. ఈ సమావేశం ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. ఏఐటీయూసీ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, జీఎం పీసీఎస్ శ్రీనివాసులు, చీఫ్ ఆఫ్ ఓఅండ్‌ఎం జైన్ సింగ్, సీఎంవోఐ అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ అజ్మీరా తుకారాం, స్థానిక ప్రజాప్రతినిధులు ఎండీ ఫయాజ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇందారంఖని 1ఏ గనిపై ఎంపీ..

శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఇందారంఖని 1ఏ, ఇందారం ఓపెన్‌కాస్టుగనిపై నిర్వహించిన కార్యక్రమంలో ఎమెల్యే వివేక్, పెద్దపెల్లి ఎంపీ వంశీకృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, ఏఐటీయూసి నాయకులు బాజీసైదా, ప్రాజెక్టు అధికారి ఏవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేకే-5 గనిపై..

మందమర్రి రూరల్, అక్టోబర్ 11 : మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ అధ్యక్షతన కేకే-5 గనిపై ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చెన్నూర్ ఎమ్మెల్యే పాల్గొని, మాట్లాడారు. ఉత్పత్తి ఉత్పాదకత విషయం లో పొదుపు పాటించాల్సిన అవసరం ఉందని, ఉద్యోగులు సమయపాలన పాటిస్తే సంస్థకు మరింత లాభాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఓదెలు, ఏఐటీయూసీ రామకృష్ణపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, సీఎంవోఏఐ ఏరియా అధ్యక్షుడు రమేశ్, డీజీఎం ఐఈడీ రాజన్న, కేకే గ్రూప్ ఏజెంట్ రాందాస్, గని మేనేజర్ ప్రవీణ్, ఉద్యోగులు పాల్గొన్నారు.